కథ

# ప్రయాణం

సత్యాజీ
94900 99167

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.



కరోనా కాలం.. ఎన్నో ఊహించని మార్పులు తెచ్చింది. రోడ్డు మీద ఎవర్ని చూసినా మాస్కుతోనే కనిపిస్తున్నారు.

'ఇంతకీ ఆనందరావు గారు ఎక్కడ ఉన్నారో, ఏమో!' అనుకుంటూ..

గురుద్వారా బస్టాపు దగ్గర కారు ఆపాను. సన్నని తుంపరలో.. గొడుగు అడ్డుపెట్టుకొని వెనక నుంచి వేగంగా వచ్చిన మనిషి కారులోకి తొంగిచూస్తూ..

''ఉదయ్ గారేనా?'' అని అడిగాడు.

''అవునండీ..'' అన్నాను.

'ఆనందరావు గారేనా!?' అని నేను అడగాల్సిన పని లేదు. వెనక డోర్ తీయబోతుంటే ముందు కూచోమని చెప్పాను. అసలు ఒక మనిషి తోడుకోసమే కదా బ్లాబ్లా యాప్‌లో ఈ జర్నీ ఆఫర్ పెట్టాను. అలాంటిది ఆయన వెనక కూచుంటే ఎలా? కారులో దూర ప్రయాణం బాగుంటుంది. ఒక మనిషి తోడుంటే ఇంకా బాగుంటుంది. ప్రయాణంలో రకరకాల దృశ్యాలు కనిపిస్తాయి. రకరకాల మనుషులూ తారసపడతారు. ఎప్పటికన్నా ఇలాంటి ప్రయాణాల్లో ఆలోచనలు వేగంగా కదులుతాయి.. బహుశా కళ్ల ముందు దృశ్యాలు అప్పటికప్పుడే ఎన్నెన్నో తారసపడ్డం వల్ల కాబోలు! దృశ్యాల్లోంచి అనే కానేక ఆలోచనలు రూపుదిద్దుకుంటూ ఉంటాయి.

''ఓం సాయిరాం! మీరు ఎక్కడినుంచి వస్తున్నారు?'' అడిగాడు ఆనందరావు.

''భోగాపురం మిరాకిల్ నుంచి''.. అని చెప్పాను.

''ఓహో.. భజన పాటలు ఏమన్నా ఉన్నాయా?''

''లేవండీ..'' అన్నాను.

''మీ కుర్రోళ్ల దగ్గర అన్నీ ఉంటాయి.. అసలైనవి తప్ప! ఇదిగో! దీనిని ప్లే చేయండి. ఇలాంటి ముసురు వేళ.. మనసు ప్రశాంతంగా ఉంటుంది. ప్రయాణం హాయిగా సాగుతుంది'' అని ఓ పెన్‌డ్రైవ్ చేతికిచ్చాడు.

ప్లే చేశాను. మంద్రస్వరంలో భజన గీతాలు మొదలయ్యాయి. కళ్లు మూసుకొని తన్మయమైపోతూ ఉంటాడనుకున్నాను. మాట్లాడ్డం మొదలెట్టాడు..

''ఉదయ్ గారూ! మనం ఎక్కడున్నా, ఎంత ఎదిగినా.. మన సంస్కృతిని, సంప్రదాయాన్ని మర్చిపోకూడదండి. మనం మర్చిపోవడం వల్లే కొందరు మొత్తం ఆక్రమించేస్తున్నారు. ఇలా చూస్తా కూర్చుంటే కొన్నాళ్లకు మనం ఉండం''.

ఏం చెబుతున్నాడో అర్థం కాలేదు. ప్రశ్నార్థకంగా అతనివేపు చూశాను. నవ్వాడు.

''చూశారా!? అసలు ఏం జరుగుతుందో కూడా మీకు అర్థం కావడం లేదు. పరాయోడు మన కంచెను దాటేసి, గుమ్మం దాటేసి, ఇంట్లోకి వచ్చేసి, మనోళ్లను మార్చేస్తున్నా మనం పట్టించుకోవడం లేదు. మీలాంటి కుర్రోళ్లు ఇలా ఉంటే హిందూదేశం కాస్త ఇంకేదో దేశంగా మారిపోవడం ఖాయం..'' అన్నాడు.

నేను ఇన్నాళ్లూ పట్టించుకోని చాలా ముఖ్యమైన విషయమేదో అతను మాట్లాడుతున్నట్టు అర్థమైంది. కానీ, విషయమేంటో అస్పష్టంగానే ఉంది. ఏదో ఒకటి అనాలి కదా అని..

''మనది భారతదేశం కదండీ..'' అన్నాను.

మళ్లీ నవ్వాడు.

''ఇంగ్లీషోడు రాసిన పుస్తకాలు చదివి పాడైపోతున్నారు మీరు. అసలు మనమంతా ఎవరం? హిందువులం. హిందువులు నివసించే దేశం ఏమవుతుంది? హిందూదేశం అవుతుంది. ఇలాంటి చిన్న లాజిక్ కూడా అర్థం కాకుండా చెత్త చదువులు ఎక్కిస్తున్నారు''..

నవ్వుతున్నట్టే ఉన్నాడు కానీ, ఏదో కచ్చితమైన విషయం మహా గట్టిగా ఎక్కించాలని ప్రయత్నిస్తున్నాడని నాకు అర్థమైంది.

''మనదేశంలో ఇంకా చాలా మతాలు ఉన్నాయి కదండీ.. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలూ.. అందరం కలిసే జీవిస్తాం కదా?''.

''కలిసి మెలసి జీవించడమంటే కలగలసిపోవడం కాదు కదా? ఎవరు ఎక్కడ ఉండాలో అక్కడ ఉండాల.. ఎవరు ఎక్కడినుంచి వచ్చారో అది గుర్తుండాల. ఫర్ సపోజ్.. నేను మీ కార్లో కూర్చున్నాను. అంతమాత్రాన ఈ కారు మీతోపాటు నాకూ సొంతమైపోద్దా? ఇది మీ సొంతం అన్న జ్ఞానం నా బుర్రలో ఉండొద్దా? కానీ, ఇప్పుడు కొంతమందికి ఉండటం లేదు''.

ఆ లాజిక్ తీసేసరికి ఏం మాట్లాడాలో నాకు అర్థం కాలేదు. డ్రైవ్ చేస్తూనే..

'ఇంకా ఏం చెబుతాడా!?' అన్నట్టు అప్పుడప్పుడూ అతనివేపు చూస్తున్నాను. చాలా వేగంగా, స్పష్టంగా చాలా విషయాలు చెప్పుకొంటూ పోతున్నాడు. ఎప్పుడూ నేను వినని విషయాలు, ఫ్రెండ్స్ కూడా చర్చించని విషయాలు, ఎవరెవరి నుంచి దేశానికి ఎంత ప్రమాదం పొంచి ఉందో విడమరుస్తున్న విషయాలు.. నాలో ఆసక్తిని గమనించి, ఇంకా ఉత్సాహంగా చెబుతున్నాడు. అవన్నీ వింటూ..

'మనచుట్టూ ఉన్న మనుషుల్లో, మతాల్లో ఇంత కుట్ర దాగి ఉందా?' అని దిగ్భ్రాంతికి గురయ్యాను.

అడ్డురోడ్డు జంక్షన్ దాటాక హఠాత్తుగా ఒక దగ్గర ఆగమన్నాడు. రోడ్డు పక్కన కారు ఆపాను. కొద్ది మీటర్లు వెనక్కి నడిచాడు. అక్కడ ఒక ఆవు కొద్దిగా గాయపడి రోడ్డుపక్కన పడుకొని ఉంది.

''గోమాతా! ఎందుకమ్మా నీకీ దుర్గతి?'' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఏదో శ్లోకం బిగ్గరగా చదివాడు.

ఆ పక్కనే పాన్‌షాప్ ఉంది. అక్కడ కూర్చున్న కొందరిని కేకేసి, అరటిపళ్లు తీసుకురమ్మన్నాడు. ఒకతను అరటిపళ్లు తీసుకురాగా, మరో ముగ్గురు వెంట వచ్చారు. ఈలోగా అక్కడ జనం కూడా గుమిగూడటంతో అందరినీ చైతన్యపరచాలని సంకల్పించాడు ఆనందరావు.

''మనకు జన్మనిచ్చిన అమ్మ ఒక మాత. ఈ ఆవు మరొక మాత. అదే గోమాత! అలాంటి మాతను ఇలా రోడ్డున వదిలేయడం ధర్మమేనా? మన సంస్కృతియేనా? ఏ చీకటిపడ్డాకో దుర్మార్గులు కొందరు ఈ గోవును చంపుకొని తినేస్తే మీరేం చేస్తారు? మీ తల్లిని అలా చేస్తే ఊరుకుంటారా?''.. నాతో మామూలుగా మాట్లాడిన ఆనందరావు ఇక్కడ విశ్వరూపం చూపిస్తున్నట్టు అర్థమైంది. జనం పోగవుతున్నారు. అతను చాలా ధాటిగా ప్రసంగిస్తున్నాడు. ఇంతలో ఒకతను గుంపును తోసుకుంటూ లోపలికి వచ్చి..

'త్ త్!' అంటూ దాన్ని అదిలించాడు. అది నెమ్మదిగా లేచింది. చూస్తే అది ఆవు కాదు.. ఎద్దు.

''గోమాత కాదండీ.. గోపిత'' అన్నాడు ఓ కుర్రోడు.

''ఇలాంటి వేళాకోళాల వల్లే మన సంస్కృతి దెబ్బతింటున్నది'' అని చిరచిరలాడాడు ఆనందరావు.

జనం ఎవరిదారిన వారు బయల్దేరారు.

''అరటిపళ్లకు డబ్బులేవీ?'' అంటూ షాపాయన బయటికి వచ్చాడు.

''గోవుకు పెట్టిన పళ్లకు డబ్బులు అడుగుతావటయ్యా! అది నిన్ను వైతరణిని దాటించే పుణ్యం అనుకో!'' అని ఓ నవ్వు నవ్వేసి, కారువైపు నడిచాడు ఆనందరావు.

* * *